# హంసలను వేటాడొద్దు [6]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [6]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఏప్రిల్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2383

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [6]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** యెగార్ పొలుష్కిన్ రేవు దగ్గర ఉద్యోగంలో మరిన్ని సమస్యలు ఎదురవుతాయి. ఒక పర్యాటక బృందం కోసం మొదటి సారి మరపడవ తీసుకెళ్తాడు యెగార్. వాళ్లకి నది మధ్య ఒక గుట్ట మీద గుడారాలతో విడిది చేస్తారు. యెగార్ కొడుకు కోల్కా కూడా తండ్రితో బాటు వస్తాడు. పర్యాటకుల బృందం కోసం తెప్పలు ఊది పెడ్తాడు. ఆ పర్యాటక బృందం అల్లరిగా ఒక చీమల పుట్టకు నిప్పంటిస్తుంది. యెగార్ చేత బాగా తాగించి నాట్యం చేయించే ప్రయత్నం చేస్తుంది. తండ్రిని ఈ పరిస్థితిలో చూసి సహించలేని కోల్కా అడ్డుకోవటానికి ప్రయత్నిస్తాడు. తండ్రి అతణ్ణి కొడతాడు. కోల్కా కోపంగా వెళిపోతాడు. యెగార్ వెనుకే బయల్దేరతాడు. కానీ పడవ తిరబడుతుంది. ఆ తిరబడిన పడవని తాడుతో లాక్కొస్తూ తీరం వెంబడి నడుస్తూ రేవు వైపు బయల్దేరతాడు యెగార్. **ఇక చదవండి:——**

## 6

"మూర్ఖుడు పోగొట్టుకున్నచోటే తెలివైనవాడు సంపదను కనుగంటాడు," – అన్నది పెద్దల నానుడి. ఇప్పటిలాగానే ఆ రోజులలోనూ మూర్ఖులకు కొదవ లేదు కాబట్టి వాళ్లకు బాగా తెలుసు.

ఫ్యొడార్ ఇపటొవిచ్ చాలా ఆందోళనతో రోజులు గడుపుతున్నాడు. అతడి సమస్య డబ్బు కాదు – కావలసినంత డబ్బు అతని దగ్గర ఉంది. అయితే, తెలివి ఉన్నవాడెవ్వడూ చూస్తూ, చూస్తూ డబ్బులు చెయ్యి జారనివ్వడు. ఏమీ లేకుండా డబ్బులు అలా ఇచ్చెయ్యటమంటే ఎలా? అలా చెయ్యటం ఫ్యొడార్ ఇపటొవిచ్‌కి గుండె పిండేసినట్లు ఉంటుంది.

కానీ, ఎంత బాధాకరమైనప్పటికీ ఆ పని చెయ్యక తప్పేటట్టులేదు. ఎందుకంటే కొత్త అటవీ వార్డెను (అతడి సిగతరగ, ఎంత మర్యాద వలకబోస్తాడండి!) మొదటి సమావేశంలోనే జమాఖర్చు లెక్కలు, ధ్రువీకరణ పత్రాలనన్నింటినీ చూసి, "మీ ఇంటికి ఎంత ఖర్చు అయ్యింది, బుర్యానోవ్?" అంటూ ఆరా తీసాడు.

“నా ఇంటికా?” ఫ్యాడార్ ఇపటొవిచ్ చాలా తెలివైన వాడు: పట్టణం నుంచి వచ్చిన అధికారి ఏం అడుగుతున్నాడో వెంటనే గ్రహించేసాడు. “దానికేమి ఖర్చు అయ్యింది? మా తోడల్లుడు నాకు కొత్త ఇల్లు కట్టిపెట్టాడు, దానికి బదులుగా నా పాత ఇల్లు అతడికి ఇచ్చాను. అంతా అందరికీ తెలుసు: మీకు కావాలంచే నోటరీ చేయించిన ప్రతి –”

“నేను నిర్మాణం గురించి అడగటం లేదు. మీ కొత్త ఇల్లు కట్టడానికి కలపకి ఎంత ఖర్చు అయ్యిందని నేను అడుగుతున్నాను. రక్షిత ప్రాంతం నుంచి కలప కొట్టడానికి మీకు అనుమతి ఎవరు ఇచ్చారు? ఆ అనుమతి పత్రం ఏది? జమాఖర్చు లెక్కలు, రిజిస్టర్లు, ధ్రువీకరణ పత్రాలు ఏవి?”

“ప్రతి దానికి లెక్కలు, పత్రాలు ఎలా ఉంటాయి, యూరి పెట్రోవిచ్? ఇది మన అడవికి సంబంధించిన వ్యవహారం.”

“ఇది నీ నేర వ్యవహారం, బుర్యానోవ్.”

నవ్వుతోనే ఆ రోజు సమావేశం ముగిసింది. అటవీ వార్డెను అతడికి రెండు వారాల గడువు ఇచ్చాడన్నది నిజమే. రెండు వారాలలో అంతా సరిచెయ్యమన్నాడు, లేకపోతే...

“లేకపోతే మన పని అయినట్టే, మారిట్సా. అతడు మనల్ని కోర్టుకి లాగుతాడు.”

“అయ్యో దేవుడా. మరి ఎలా ఫ్యోడార్?”

“నన్నే కట్టడి చెయ్యటానికి చూస్తాడా? సరే, నేను కూడా అతడి సంగతి చూస్తాను!”

కట్టడానికి అతడి దగ్గర డబ్బులు ఉన్నాయి, కానీ వాటిని ఇవ్వటమంటే అతడి మనసుకి కష్టంగా ఉంది. ఇల్లంతా కట్టుకున్న తరువాత దానికి డబ్బు ఇవ్వటమంటే మరీ కష్టంగా ఉంది. ఇంటి కప్పు మీద పుంజుతో ఇల్లు బొమ్మల్లో మాదిరి ముచ్చటగొలుపుతూ ఉంది. ఇప్పుడు దానికి డబ్బులు చెల్లించటమంటే – ఆ ఆలోచననే అతడు భరించలేకపోతున్నాడు.

తను కట్టవలసిన డబ్బు ప్రజలనుంచి దండుకోటానికి ఫ్యాడార్ ఇపటొవిచ్ ప్రయత్నించసాగాడు. కట్టెపుల్లల కోసం రెండు వందలు వసూలు చేసాడు. ఏ అడవిలోంచి తాను కలప తీసుకున్నందుకు డబ్బులు కట్టమన్నారో, అదే అడవినుంచి కట్టెపుల్లలు కొట్టుకోనిచ్చి డబ్బులు వసూలు చేసాడు. అటవీ వార్డెను పట్టణంలో కూర్చుని, పటాలు పరిశీలించటంలో తలమునకలై ఉండగా అతడు తన పని తాను చేసుకుంటూపోతున్నాడు: అవకాశం ఉన్నప్పుడు సొమ్ము

చేసుకోమన్నారు, అలా చెయ్యకపోవటం పాపంతో సమానం. అయితే, కొత్త వార్డెను నిక్కచ్చైన మనిషన్న వార్త ఊరంతా వ్యాపించటంవల్ల అతడు బాహాటంగా ఆ పని చెయ్యటానికి భయపడుతున్నాడు. అతడు ఇతర అవకాశాల కోసం వెతకసాగాడు. అతడు స్వయంగా వెతకటమే కాకుండా అందులో కొడుకుకి కూడా తర్ఫీదు ఇచ్చాడు.

"వాసన పసిగట్టాలి, ఓవా. డబ్బు వాసన ఎక్కడ వస్తోంది?"

ఓవా బాగానే పసిగట్టేవాడు. అయితే అది మరీ అంత ఎక్కువ కాదనుకోండి: సలహాకి, అనుమతికి, రవాణాకి ముప్పై రూబుళ్లు. కానీ ఆలోచిస్తే ముప్పై రూబుళ్లు తక్కువ డబ్బేమీ కాదు.

పర్యాటకుల నుండి ఫ్యోడార్ ఇపటొవిచ్ ముప్పై రూబుళ్లు సంపాదించాడు. చెరువు ఒడ్డున చేపలు ఏమీ దొరకకపోవటంతో ఆ సాయంత్రానికే వాళ్లు విసిగిపోయారు. ఈ విషయాన్ని ముందుగా ఓవా పసిగట్టాడు (కోల్కా కోసం వెదకమని అతడిని పంపించారు, డబ్బు చేసుకునే అవకాశం దొరికినప్పుడు కోల్కా సంగతి ఎవరు పట్టించుకుంటారు!); ఆ విషయం తెలియగానే అతడు వెళ్లి తన తండ్రికి చెప్పాడు. ఫ్యోడార్ ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా అక్కడికి వచ్చి మగవాళ్లతో కరచాలనం చేసాడు, మంట పక్కన కూర్చుని చుట్ట కాల్చాడు. చేపలు దొరకకపోవటంపై విచారం వ్యక్తంచేసి, "చేపలు, పుట్టగొడుగులు, పళ్లు దండిగా దొరికే ప్రదేశం ఒకటి ఉంది. అయితే అక్కడికి ఎవరినీ అనుమతించరు. అందుకే అక్కడి చేపలు అబ్బ ఎంత పెద్దగా ఉంటాయో!"

ఆకుకి అందకుండా, పోకకి చెందకుండా కొంతసేపు అతడు బేరం చేసాడు. చివరికి చీకటి పడిన తరువాత అతడు తన ముసలి గుర్రానికి బండికట్టి తెచ్చి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లచెరువు ఒడ్డుకి పర్యాటకులను చేర్చాడు. అక్కడ నిజంగానే చేపలు దండిగా దొరికాయి, దానికి పర్యాటకులకి సరిగ్గా ముప్పై రూబుళ్లు ఖర్చయ్యాయి. ఎలా బతకాలో ఫ్యోడార్ ఇపటొవిచ్‌కి తెలుసు, దానిని ఎవరూ కాదనలేరు!

ఈ కారణంగా రెండు రోజుల తరువాత స్పృహలోకి వచ్చిన యెగార్‌కి ఆ ప్రదేశంలో ఆరిపోయిన మంట, ఖాళీ డబ్బాలు, కోడిగుడ్డు పెంకులు తప్పించి ఏమీ కనపడలేదు.

గాలిలో కలిసిపోయినట్లు పర్యాటకులు మాయమైపోయారు.

అంతేకాదు, మోటారు కూడా మాయమైపోయింది. అది చాలా మంచి మోటారు, ఎనిమిది హార్స్ పవర్‌ది. మోటారుతోపాటు పెట్రోలు ట్యాంకు, ఇతర సామాను కూడా పోయాయి. తెడ్లు మాత్రం అక్కడే ఉన్నాయి: దర్భ గడ్డి మధ్య వాటిని యెగార్ చూసాడు. వాటి చివర్లు మంటల్లా మెరుస్తూ ఎంత దూరానికైనా కనపడుతున్నాయి.

అయితే ఇవన్నీ అతడికి తిరిగి స్పృహ వచ్చిన తరువాత కనపడ్డాయి. ఆ రోజున అతడి నోటినుంచి నవ్వు తప్ప వేరేమీ రాలేదు. సూర్యాస్తమయం అవుతుండగా పడవను లాక్కుంటూ అతడు యకోవ్ ప్రొకొపిచ్ కార్యాలయానికి వచ్చాడు. వివరణగా పెద్దపెట్టున నవ్వటం తప్పించి అతడు ఏమీ చెయ్యలేదు. తూలుతున్న కాళ్లతో అతడు ఇంటిముఖం పట్టాడు. అతడి వెనకే కుక్కలు నడవసాగాయి.

తోడుగా ఈ కుక్కలతో అతడు తన పెరటిలోకి ప్రవేశించాడు. సాధారణంగా కుక్కలు తాగినవాళ్లని ఇష్టపడవు, కానీ యెగార్‌ని మాత్రం ఏ స్థితిలోనైనా ఇష్టపడతాయి. అతడు పూర్తి మైకంలో ఉండి సరిగా నడవలేకపోతున్నా కూడా ఆడకుక్కను అనుసరించినట్టు అవి అతడి కాళ్ల వెనకాలపడి వచ్చాయి. అతడు గేటు కూడా కొట్టలేదని చెబుతారు, కుక్కలలో ఒకటి కాలితో గేటు చప్పుడు చేసిందని చెబుతారు.

ఏమో, ఇక్కడ కొంత అతిశయోక్తి ఉందేమో...

యెగార్‌ని కష్టంమీద కొట్టంలోకి చేర్చిన హారిటీనా, అతడు ఇంకెటువంటి సమస్య సృష్టించకుండా ఉండటానికి దానికి తాళం పెట్టేసింది. ఆ తరువాత నేరుగా బావగారైన ఫ్యొడార్ ఇపటొవిచ్ ఇంటికి వెళ్లి కోల్కా కనపడటంలేదని తెలియచేసింది.

“అప్పుడే పోలీసులకు చెప్పవద్దు, టీనా; దానికి ఇంకా చాలా సమయం ఉంది. ముందు కోల్కా కోసం మనమే వెదుకుదాం: అతడు ఇక్కడే ఎక్కడో ఆడుకుంటూ కూడా ఉండి ఉండవచ్చు.”

కోల్కాని వెదకటానికి అతడు ఓవాని పంపించాడు: చెరువు కట్టవెంట, యెగార్ పడవని లాక్కొచ్చిన దారివెంట ఓవా కొంత దూరం పరిగెత్తుతూ, అరుస్తూ, ఈలవేస్తూ వెళ్లాడు. అలా ఈలవేస్తూ వెళుతుండగా అతడికి పర్యాటకులు కనిపించారు. అతడి తండ్రి నేర్పించినట్టు వాళ్లకి కొంత దూరంలో ఉండగానే తన టోపీ తీసేసి అభివాదం చేసాడు.

"ఎలా ఉన్నారు, అయ్యలారా. నా తమ్ముడు కోల్కా కోసం వెదుకుతున్నాను. అతనిని మీరుగాని చూశారా?"

"మీ తమ్ముడిని మేం చూశాం, ఉదయం ఇక్కడికి వచ్చాడు." ఆ తరువాత మొత్తం కథ చెప్పారు – యెగార్ బాబాయ్ బాగా తాగి పిచ్చి పిచ్చిగా ప్రవర్తించాడని, తమతో గొడవపెట్టుకున్నాడని చెప్పారు.

"మా బాబాయ్ అంతే," ఓవా తన వంతు జోడించాడు. "మా బాబాయ్ ఎప్పుడు చూడండి సమస్యలు సృష్టిస్తుంటాడు."

ఈలోగా హారిటీనా గుండెలు పగిలేలా ఏడుస్తూ ఊరంతా పరిగెత్తుతోంది. ఆమె తన కష్టాలను కూడా మరిచిపోయింది. "అమ్మలారా కోల్కాని చూసారా? నా ముద్దుల కొడుకు కోల్కాని చూసారా?" ఎక్కిళ్ల మధ్య అందరిని అడుగుతోంది.

కోల్కా ఎక్కడా కనపడలేదు. ఒకవైపున కోల్కా మాయమైపోయాడు, ఇంకొకవైపు కోల్కా చిట్టి చెల్లెలు ఓల్యా ఇంటిదగ్గర ఉండిపోయింది — ఓల్యా, యెగార్. అయితే యెగార్ కొట్టంలో గురకలు పెడుతూ నిద్రపోతున్నాడు, ఓల్యా పెంకులు ఎగిరిపోయేలా ఏడుస్తూ ఉంది. హారిటీనా ఒక బజారు నుంచి ఒక బజారుకి, ఒక సందు నుంచి ఒక సందుకి, ఒక ఇంటి నుంచి ఒక ఇంటికి పరుగులు పెడుతుండగా ఆమె కూతురి ఏడుపు ఆమెను వెంటాడుతూనే ఉంది: దాని నోరు చాలా పెద్దది బాబు. అయితే ఆమె ఏడుపు వినిపిస్తున్నంతసేపు ఆమె ఎలా ఉందోనని ఆందోళన పడాల్సిన పని లేదు: ఆమె ఏడుస్తూ ఉందంటే ఊపిరి తీస్తూనే ఉందని అర్థం. ఆమె ఏడుపు ఆగిన మరుక్షణం హారిటీనా కాళ్లు చల్లబడిపోయాయి.

"నా కూతురు గొంతు పిసికేసారు!"

ఆ పని ఎవరు చేస్తారన్న ఆలోచనే ఆమె బుర్రలోకి రాలేదు. గాలికి రుమాలు వెనక ఎగురుతూ ఉండగా ఆమె ఇంటికి పరుగుతీసింది. ఆమె దఢేల్‌మంటూ ఇంటిలోకి ప్రవేశించేసరికి అక్కడ కోల్కా టీచరు నోనా యురీవ్నా ఉయ్యాల పక్కన నిలబడి ఉంది. ఉయ్యాలలో నాలుగు పళ్లేసుకుని ఓల్యా నవ్వుతూ ఉంది.

"బాగున్నావా, హారిటీనా మకరోవ్నా? నువ్వేమీ ఆందోళన పడవద్దు, కోల్కా నా ఇంటి దగ్గర ఉన్నాడు."

"నీ ఇంటి దగ్గర ఉన్నాడనటంలో అర్థం ఏమిటి? ఇతరుల పిల్లలను ఎత్తుకెళ్లిపోటానికి నీకు ఎంత ధైర్యం?"

"అతడి మనసు బాగా గాయపడింది, హారిటీనా మకరోవ్నా. అయితే దానికి కారణం ఎవరో మాత్రం చెప్పటంలేదు. పాలు తాగించి, మందు ఇచ్చాను, దాంతో నిద్ర పోతున్నాడు. కాబట్టి నువ్వు ఆందోళన పడవలసింది ఏమీ లేదు. ఆందోళన పడవద్దని యెగార్ సవెలిచ్‌కి కూడా చెప్పు."

"యెగార్ ఏమీ ఆందోళన పడటం లేదు, అక్కడ అతడు పందితో కబుర్లాడుతున్నాడు."

"అంతా సర్దుకుంటుంది, హారిటీనా మకరోవ్నా. అంతా అదే సర్దుకుంటుంది: రేపు అన్ని విషయాలు మాట్లాడుకుందాం."

హారిటీనా ఆమెను నమ్మలేదు: తన కళ్లతో తాను చూడటానికి నోనా యురీవ్నా వెనక పరిగెత్తింది. నిజంగానే టీచరు దుప్పటి కప్పుకుని మడత మంచం మీద కోల్కా నిద్రపోతున్నాడు. అతడు గాఢ నిద్రలో ఉన్నాడు. అతని బుగ్గల మీద ఎండిన కన్నీటి చారికలు ఉన్నాయి. అతడిని లేపవద్దని హారిటీనాని నోనా యురీవ్నా వారించి ఇంటికి పంపించివేసింది. అప్పుడు వాదనకు దిగే స్థితిలో హారిటీనా లేదు.

ఆ మరునాడు ఉదయం కూడా కోల్కా ఇంటికి తిరిగి రాలేదు. యెగార్ రాత్రంతా నిద్రపోయాడు కానీ అతడికి జరిగనది ఒక్కటీ గుర్తులేదు. పగలంతా కొట్టంలోనే ఉండి మూలుగుతూ, మంచినీళ్లు తాగుతూ ఉన్నాడు. తనని చూడటానికి యకోవ్ ప్రొకొపిచ్ వచ్చినప్పుడు కూడా అతడు లేచి బయటకు రాలేదు. అసలు ఏం జరుగుతోందో, యకోవ్ ప్రొకొపిచ్ ఎవరో, అతడు ఏం పనిమీద వచ్చాడో యెగార్‌కి ఏమీ తెలియటం లేదు.

అయితే అతడు వచ్చిన పని పెద్దదే.

"మోటరు, పెట్రోలు ట్యాంకు, ఇతర సామగ్రి. మొత్తం మూడు వందల రూబుళ్లు."

"మూడు వంద-లా?"

అంతకు ముందెన్నడూ హారిటీనా అంతటి డబ్బును కళ్ల చూడలేదు. అందుకే వందకు మించిన అన్ని మొత్తాలను ఆమె ఎంతో గౌరవం ఇచ్చి పలికేదు.

"మూడు వంద-లా?.. మా మీద కనికరం చూపించు, యకోవ్ ప్రొకొపిచ్!"

"నేను జాలిపడినా లాభం లేదు: చట్టానికి కనికరం లేదు హారిటీనా. మూడు రోజులలోపు నాకు సామాను అందకపోతే నేను పోలీసుల దగ్గరకి వెళ్లాల్సి ఉంటుంది. ఫిర్యాదు చెయ్యక తప్పదు."

యకోవ్ ప్రొకొపిచ్ వెళ్లిపోయాడు. హారిటీనా నేరుగా కొట్టంలోకి వెళ్లింది: మొగుడిని కుదిపింది, లాగింది, తిట్టింది, చివరికి కొట్టింది కూడా. కానీ, యెగార్ మాత్రం మూలగటం తప్పించి ఏమీ చెయ్యలేదు. చివరికి అతడు ఎంతో కష్టంమీద నోరు తెరిచి, మాట్లాడాడు: "నేను ఎక్కడ ఉన్నాను?"

ఇప్పుడు ఆమె కోల్కా గురించి ఆందోళన పడటంలేదు: అతడు నోనా యురీవ్నా ఇంటి దగ్గర క్షేమంగానే ఉన్నాడు. ఇప్పుడు పిల్లా, జెల్లా; కొంపా, గూడూ సమస్తం మునిగిపోయే పరిస్థితి వచ్చింది. దాంతో హారిటీనా మొగుడు ఉన్న కొట్టంలోకి మరొక గంగాళం నీళ్లు పెట్టి, కొట్టానికి తాళం వేసి తనకున్న ఏకైక ఆప్తులు అక్క మారిట్సా, బావ ఫ్యొడార్ ఇపటొవిచ్ దగ్గరకు పరిగెత్తింది.

"మమ్మల్ని ఆదుకోండి, అక్కా! మూడు వంద-ల రూబుళ్లు కట్టమంటున్నారు!"

"చట్టాలు అలా ఉన్నాయి," ఫ్యొడార్ ఇపటొవిచ్ గంభీరంగా చెప్పాడు. "చట్టం ఉంది చూసావు, టీనా – దాని నుంచి తప్పించుకోలేరు."

"అలాగయితే మేం అడుక్కుంటూ బతకాల్సి ఉంటుంది! అడుక్కుంటూ, అక్కా!"

"పరిస్థితులు అలా దాపురించాయి, మరి ఏం చేస్తాం. మమ్మల్ని కూడా డబ్బు కట్టమంటున్నారు తెలుసా. అదీ మూడు వందల కంటే చాలా ఎక్కువ. కానీ మేం పిచ్చి పట్టినట్టు పరిగెత్తుతూ వాళ్ల కాళ్లు పట్టుకుని, వీళ్ల కాళ్లు పట్టుకుని దేబిరించటం లేదే. లోకం అలా ఉంది, హర్యా."

హారిటీనా ఆ రోజంతా ఊరు మొత్తం తిరిగింది, కొంతమందికి ఫిర్యాదు చేసింది. కాని చివరికి ఒట్టి చేతులతో ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె ఎంతో ప్రయత్నించింది, ఎంతో పాకులాడింది. రోజు గడిచిపోయింది కాని తన పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు మిగిలింది: మోటరు చెరువు అడుగున ఉంది, మూడు వందల రూబుళ్లు ఆమె మెడ చుట్టూ ఉరితాడులా ఉన్నాయి, మొగుడు పందితోపాటు కొట్టంలో పడి ఉన్నాడు, కోల్కా ఎవరి ఇంటిలోనో ఉన్నాడు.

ఆ రాత్రి యెగార్ గంగాళం నీళ్లు తాగేసాడు, బాగా నిద్రపోయాడు. తెల్లవారేసరికి ఎప్పటిమాదిరి అయిపోయాడు. అది ఎలా సాధ్యమో తెలియదు కానీ అతడు అంతకు మునుపటి కంటే నిశ్శబ్దంగా మారిపోయాడు. హారిటీనా రాత్రికి రాత్రి చిక్కిపోయింది, ఉన్నట్టుండి ఆమె కూడా మెల్లగా మాట్లాడటం మొదలుపెట్టింది. మొగుడిని ఒకటే వేడుకుంది: "గుర్తుకు తెచ్చుకోటానికి ప్రయత్నించు, యెగార్. నువ్వు ఎక్కడ ఉన్నావు, ఎక్కడ తాగావు, ఆ తరువాత ఎటు వెళ్లావు..."

ఆమెకు ఒకటి, రెండు విషయాలు తెలుసన్నది నిజమే: అది కోల్కా ద్వారా కాదు – అతడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ముఖం తిప్పేసుకున్నాడు అంతే. ఆ విషయాలు ఆమెకు ఓవా చెప్పాడు.

"ఎవరో పర్యాటకులు అతడికి మందు పోసారు, టీనా పిన్నీ."

"పర్యాటకులా?" యెగార్ తలంతా దిమ్ముగా ఉంది. అతడి తల ఖాళీగా అనిపించి ఎటువంటి ఆలోచనలు రావటంలేదు: అతడి ఆలోచనలన్నీ తోకలెత్తుకుని పారిపోయి, అక్కడ చెత్తా, చెదారం మాత్రం మిగిల్చినట్టున్నాయి. "ఎవరా పర్యాటకులు?"

"యకోవ్ ప్రొకొపిచ్ దగ్గరకు వెళ్లు, యెగార్. అతడికి అంతా తెలుసు. ఆ మోటరు ఎక్కడ ఉందో వెతుకు. మన పిల్లల కోసమైనా దాన్ని నువ్వు వెతికి, పట్టుకోవాలి!"

ఆ రోజులో అధిక భాగం యెగార్ చెరువు అడుగున మోటరు, పెట్రోలు ట్యాంకు, ఇతర సామాను కోసం వెతుకుతూ గడిపాడు. నీటిలో మునకలు వేస్తూ చేతులతో తడిమి చూసాడు, కాళ్లతో తడుతూ చూసాడు. కాసేపు ఒడ్డుమీద ఒణుకుతూ నిలబడి చుట్ట కాల్చాడు. తరువాత మళ్లీ నీటిలోకి దిగాడు. పడవ ఎక్కడ తిరగబడిందో అతడికి గుర్తులేదు, అతడికి చెప్పటానికి ఎవరూ లేరు. తెచ్చుకున్న చుట్టల కట్ట అయిపోయింది, చలి ఎముకలకంటా కొరికేస్తూ ఉండటంతో ఆ రోజుకి వెదకటం ఆపాడు యెగార్. బురదలో ఒక తాళం, దర్భ పోచల మధ్య తెడ్లు మాత్రం దొరికాయి. వాటిని తీసుకుని యకోవ్ ప్రొకొపిచ్ దగ్గరకు వచ్చాడు.

"నాకు ఒక పడవ ఇవ్వు, యకోవ్ ప్రొకొపిచ్. గాలం తీసుకుని చెరువు అడుగున వెదుకుతాను – ఇలా చాలా చలిగా ఉంది. బురద నీళ్లల్లో వెదుకుతూ తిరగటం చాలా కష్టంగా ఉంది."

"నీకు పడవ ఇవ్వను, పొలుష్కిన్. నువ్వు నా నమ్మకాన్ని కోల్పోయావు. వస్తువులన్నీ తీసుకునిరా, అప్పుడు చూద్దాం."

"దేని గురించి చూస్తావు?"

"నీ భవిష్యత్తు గురించి."

"నువ్వు చెప్పినట్టు చేస్తే మిగిలిన జీవితం నేను ఆసుపత్రిలో గడపాల్సివస్తుంది. బయట బాగా చలిగా ఉంది, యకోవ్ ప్రొకొపిచ్. నా కాళ్లు గడ్డకట్టుకుపోతాయి."

"లేదు, పొలుష్కిన్, నన్ను అడగవద్దు. అవి నా విలువలు."

"నీ విలువలకు ఏమీ కాదు, యకోవ్ ప్రొకొపిచ్. దేవుడి మీద ఒట్టేసి చెబుతున్నాను."

"విలువలు, పొలుష్కిన్, నీకు తెలుసుగా –"

"నాకు తెలిసింది, యకోవ్ ప్రొకొపిచ్. నాకు ఇప్పుడు అంతా తెలిసింది."

యెగార్ మెల్లగా తల ఊపుతూ నిలబడ్డాడు, కొన్నిసార్లు నిట్టూర్చాడు. యకోవ్ ప్రొకొపిచ్ మళ్లీ దేని గురించో మాట్లాడటం మొదలుపెట్టాడు – అతడి మాటలు సుదీర్ఘంగా, విసుగు కలిగించేవిగా ఉన్నాయి – అయితే యెగార్ అదేమీ వినటం లేదు. తెల్లటి అతడి కనురెప్పల మధ్య రెండు అనవసరపు కన్నీటి బిందువులు రాలాయి. అర్ధాంతరంగా, ఏమీ అర్థం లేకుండా, "సరే పో, నీ పడవలో షికారుకి పో," అన్నాడు.

ఆ రోజంతా కష్టపడి వెదికితే దొరికిన ఒక్కగానొక్క తాళాన్ని కూడా చెరువులోకి తిరిగి విసిరివేసాడు. ఆ తరువాత అక్కడినుంచి వెళ్లిపోయాడు. ముఖం మీద పిచ్చి చూపుతో కాసేపు యకోవ్ ప్రొకొపిచ్ అలా చూస్తూ నిలుచుండిపోయాడు, ఆశ్చర్యంతో అతడి దవడ కూడా కిందికి జారింది. కాసేపటికి గాని అతడికి నోటమాట రాలేదు, "పొలుష్కిన్! ఆగు! పొలుష్కిన్, ఆగమంటున్నాను!

యెగార్ ఆగాడు. వెనక్కి తిరిగి మెల్లగా చెప్పాడు, "దేనికి అరుస్తున్నావు, ప్రొకొపిచ్? నేను మూడు వందల రూబుళ్లు బాకీ ఉన్నాను. ఆ మూడు వందల రూబుళ్లు నీకు అందుతాయి. తప్పకుండా అందుతాయి. అవి నా విలువలు."

తన కాళ్లవంక చూసుకుంటూ అతడు ఇంటివైపు నడిచాడు. ఇంటికి చేరిన తరువాత కూడా తల పైకి ఎత్తలేదు. తెల్లటి కనురెప్పల మాటున దాగిన అతడి కళ్లల్లోకి చూడాలని హారిటీనా ఎంత ప్రయత్నించినా అతడి చూపులతో తన చూపులను కలపలేక పోయింది.

"దొరికాయా, యెగార్? మోటరు దొరికిందా అని అడుగుతున్నాను."

యెగార్ బదులివ్వలేదు. అతడు నేరుగా వంటింటి బల్ల దగ్గరకు వెళ్లాడు. సర్రుమంటూ సొరుగు బయటకులాగి దాంట్లో ఉన్న గరిటెలు, అన్నీ బల్ల మీద వేసాడు.

"మనకి రేపటివరకు ఇంకా గడువు ఉంది, యెగార్. వెదకటానికి నేను కూడా వెంట రానా? ఇద్దరమైతే చెరువు అడుగు అంతా జల్లెడ పట్టవచ్చేమో?"

యెగార్ ఏమీ మాట్లాడలేదు. అతడు నిశ్శబ్దంగా కత్తులను చూడసాగాడు: వంకరపోకుండా ఏది ఉంటుందో చూడసాగాడు. ఒక కత్తిని తీసుకుని, అరలోంచి ఆకురాయి తీసి, దానిమీద ఉమ్మేసి, కత్తిని పదును పెట్టసాగాడు. హారిటీనా గడ్డకట్టుకుపోయింది.

"ఆ కత్తిని ఎందుకు పదును పెడుతున్నావు, యెగార్ సవెలిచ్?"

యెగార్ మాట్లాడకుండా ఆకురాయి మీద కత్తిని రాస్తున్నాడు: అది స్విష్, స్విష్‌మని శబ్దం చేస్తోంది. అతడి కనుబొమ్మలు గీతమాదిరి ముడిపడి ఉన్నాయి. ఎండకి తెల్లబడ్డ అతడి కనుబొమ్మలు ఏమాత్రం భయంగొలపటం లేదు. అయినాగాని వాటిని ముడివేసాడు.

"యెగార్ సవెలిచ్..."

"నీళ్లు మరగబెట్టు, హారిటీనా. గిన్నెలు కూడా సిద్ధం చెయ్యి."

"ఇవన్నీ దేనికి?"

"పందిని అమ్మెయ్యబోతున్నాను."

తల్లి కోడి మాదిరి హారిటీనా ఎగిరి పడింది. "ఏమిటి?!"

"నేను చెప్పినట్టు చెయ్యి."

"ఏమిటి... నీకు ఏమయ్యింది? ఏం చేస్తున్నావో తెలుస్తోందా, నష్టజాతకుడా! ఆ పందిని అమ్మేస్తే చలికాలంలో మనం తినటానికి ఏముంటుంది? ఏమి తింటాం? దేవుడి భిక్షా?"

"నేను చెప్పాల్సింది చెప్పాను."

"నేను ఒప్పుకోను! నేను అనుమతించను! మిగిలినవాళ్లందరూ..."

"నీ పెడబొబ్బలు ఆపు, హారిటీనా. అతడికే కాదు, నా విలువలు నాకూ ఉన్నాయి."

అంతకుముందు ఎప్పుడూ అతడు పందిని చంపలేదు: దానికి అతడు గట్టి గుండె ఉన్నవాళ్ల సహాయం తీసుకునేవాడు... కానీ ఇప్పుడు అతనికి పిచ్చి పట్టినట్టు ఉంది: ఏడుస్తూ, వణుకుతూ, గుడ్డిగా కత్తితో పొడిచాడు. పంది మెడనిండా గాట్లు పెట్టి, చివరికి దానిని ఎలాగో చంపాడు. ఆ నాలుగు కళ్ల కంటనీటితో తడిచిన ఆ పందికి ఆ క్షణమే ఉప్పు పట్టించినట్టయ్యింది.

కోల్కా అక్కడ లేకపోవటం మంచిదే అయ్యింది. కోల్కా తన టీచరు నోనా యురీవ్నా ఇంటిదగ్గర సేదదీరుతున్నాడు. ఆమె పట్టణం నుంచి వచ్చిన ఒంటరి చిన్నపిల్లే అయినా ఆమెకు ధన్యవాదాలు తెలపాలి.

రాత్రి అయ్యేసరికి పందిని కొయ్యటం పూర్తయ్యింది: మాంసాన్ని సంచులకెత్తారు, పేగులు తమకి ఉంచుకున్నారు. సంచులను యెగార్ భుజం మీదకి వేసుకుని ఆ రాత్రికే రైలుస్టేషనుకి బయలుదేరాడు. తెల్లవారేసరికి పట్టణం చేరుకుని బజారులో మంచి చోటు దొరకబుచ్చుకోవాలని అతడి ఆలోచన. తన చొరవలో ఎలాగూ నమ్మకంలేదు కాబట్టి అలాగైనా మంచి బేరాలు దొరుకుతాయని అతడి ఆశ. మామూలుగానే అతడికి ధైర్యం తక్కువ, చలికాలంలో నీటి అడుగుకి చేరే చేప మాదిరి ఇప్పుడు ఆ కాస్తంత శక్తి లోపలకి ఇంకిపోయింది.

"లోకం అలాగే ఉందనుకుంటా!"

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com